


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




ఆదివారం 21-12-2025 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక :200 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## దేశంలో ఎక్కడా ఇంత గొప్ప కార్యక్రమం లేదు- డిప్యూటీ సీఎం భట్టి



## ఆసిఫాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్య



## సౌదీ బస్సు ప్రమాదం..

పరిహారం విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



## ఒకే వ్యక్తి నాలుగు సార్లు ఓటు..

సర్పంచ్ ప్రమాణ స్వీకారానికి అడ్డుపడతామంటూ పార్టీ ఆగ్రహం



## తిరిగి పుంజుకుంటున్న రూపాయి..

ఒక్క రోజే 97 పైసలు జంప్



## ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై టీ బీజేపీ రాంచందర్ రావు కౌంటర్



## తండ్రిపై రూ.3 కోట్ల బీమా చేశారు.. పాముకాటుతో చంపించారు



# 21 సీట్లలో పోటీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకంలో భాగంగా రూ. 7,910 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'అమరజీవి జలధార' వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. శనివారం ఉదయం నిడదవోలు నియోజకవర్గం పెరవలి వద్ద జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో సుమారు రూ. 7,910 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని, దీని ద్వారా దాదాపు 1.21 కోట్ల మంది ప్రజల దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు ఈ ప్రాజెక్ట్ శాశ్వత పరిష్కారం చూపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మీ వల్లే గెలవాల్సిన చోట్ల ఓడిపోయాం

### సర్పంచ్ ఫలితాలపై 18 మంది ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ పెద్దలు సీరియస్



ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ ను సమన్వయం చేసుకుని వారిని బుజ్జగించడంలో విఫలమైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ ఎన్నికల ఫలితాలపై మేము ముగ్గురం చర్చించామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెబల్స్ ను సమన్వయం చేయలేని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జులపై అసహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పని చేయని 18 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా ఈ 18 మంది ఎమ్మెల్యేలు, ఇన్ చార్జీలతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడి పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 18 మంది ఎమ్మెల్యేల పని తీరుపై సీఎం, మీనాక్షి అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఇకనైనా వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆదేశించారు.

మీ వల్లే ఓడిపోయాం:

సమీక్షలో మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రెబల్స్ విషయంలో జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల ప్రతిపక్ష పార్టీలు లాభ పడ్డాయన్న అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమన్వయ లోపం వల్ల గెలవాల్సిన స్థానాల్లో కూడా ఓడిపోయామని ముఖ్యంగా వరంగల్, నల్గొండ, పాలమూరుకు చెందిన నేతలకు మీనాక్షి నటరాజన్ క్లాస్ తీసుకున్నారని సమాచారం.

# రైజింగ్ కాదు ఫ్లయింగ్ సీఎం..

## రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు సెటైర్లు



రాజకీయాల్లో అబద్ధాలు ఆడటంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేసులు, డబ్బు, గుండాయిజం ప్రయోగించినా బీఆర్ఎస్ 40 శాతం 4 వేలకుపైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకుని తన సత్తా చాటిందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి ఇవాళ ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఎరువుల కోసం గోసపడుతుంటే రేవంత్ రెడ్డి యాప్‌లు, మ్యాప్‌ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం, ఎమ్మెల్యేలకు లేని చెక్ పవర్ ఒక్క గ్రామ సర్పంచ్‌కే ఉందని అందువల్ల ధైర్యంగా పనిచేయండని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి మనుమడి సోకుల కోసం 100 కోట్లతో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడిస్తారా అని నిలదీశారు. ఓడిపోతామనే భయంతోనే రేవంత్ రెడ్డి కోపరేటివ్ ఎన్నికలు పెట్టడం లేదని, రేవంత్ రెడ్డి రైజింగ్ సీఎం కాదు, ఢిల్లీకి హైదరాబాద్‌కు చక్కర్లు కొట్టే ఫ్లయింగ్ సీఎం అని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీకాలంలో మిగిలిన మూడేళ్లు కేసీఆర్ ప్రభుత్వంలోనే ఉంటారు. మీ పనుల బాధ్యత నాది అని భరోసా ఇచ్చారు. ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీ సత్తాను చాటాయని.. కారు జోరు కాంగ్రెస్ బేజారు అయిందన్నారు. ఎప్పుడైనా లోకల్ బాడీ ఎన్నికల్లో అధికార పార్టీ 90 శాతం గెలిస్తే పది శాతం ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయి. కానీ బీఆర్ఎస్ 40 శాతం అంటే 4వేలకు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచింది. సంగారెడ్డిలో 34 సర్పంచులు గెలిస్తే అందులో 27 గెలిచామని రేవంత్ రెడ్డి చెప్తున్నాడు. బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచులను కూడా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఖాతాలో వేసుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 శాతంలోపే సర్పంచులు గెలిస్తే 66 గెలిచామని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కాంగ్రెస్ 10, 12 స్థానాలకు మించి గెలవదన్నారు.

# దీపు చంద్ర దాస్ హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్

### బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు!



బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లా భలూకాలో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్ (27) పై జరిగిన మూకదాడి, హత్య ఘటన అంతర్జాతీయంగా కలకలం రేపింది. దైవదూషణ ఆరోపణలతో అల్లరి మూకలు అతడిని కొట్టి చంపి, మృతదేహాన్ని చెట్టుకు కట్టి తగలబెట్టిన ఈ క్రూరమైన చర్యను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.




# ఎంపీటీసీ-జడ్పీటీసీ ఎన్నికలపై సస్పెన్స్

# పోటీకి సై అంటున్న నాయకులు

- ✓పంచాయతీ ఎన్నికల తర్వాత మరో ఎన్నికపై ఉత్కంఠ
- ✓ఎంపీటీసీ-జడ్పీటీసీ ఎన్నికలపై కొనసాగుతున్న అనిశ్చితి
- ✓పోటీకి సై అంటున్న గ్రామీణ రాజకీయ నేతలు
- ✓బీసీ రిజర్వేషన్‌లతో ఎన్నికల షెడ్యూల్ ఆలస్యం?
- ✓ప్రత్యక్ష-పరోక్ష ఎన్నికలపై ప్రభుత్వ ఆలోచన
- ✓ముందుగా మున్సిపల్ ఎన్నికలేనా? అన్న చర్చ
- ✓డెడికేటెడ్ కమిషన్ నివేదికే కీలక నిర్ణయం

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు ప్రమాణస్వీకారానికి సిద్ధమవుతుండగా ఇతర రాజకీయ నేతలు మాత్రం మరో ఎన్నిక ఎప్పుడంటూ చర్చ మొదలుపెట్టారు. గ్రామాల్లోని నాయకులు ఇదే అంశంపై వాడీవేడిగా చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని, ఓ పని అయిపోతుందంటూ అభిప్రాయాలు, ఆలోచనలను వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి నాయకులు సిద్ధమవుతున్నారు. ఎప్పుడైనా ఎన్నికలు రావొచ్చని ఆర్థిక సర్దుబాట్లు చేసుకుంటున్నారు. అదే టైంలో టికెట్టు సాధించడానికి వ్యూహాలు, ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ఈ నెలాఖరున ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నట్లు సమాచారం.

మిగతాది 2 లో

# రైలు నుంచి జారిపడి నవ దంపతులు మృతి



రైలు నుంచి జారిపడి నవ దంపతులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారక ఘటన తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి-ఆలేరు రైల్వే మార్గంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి నవదంపతులు ఘటనాస్థలంలోనే మృతి చెందారు.

## సంచలనం.. ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష



పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ , ఆయన భార్య బుష్రా బీబీలకు ఊహించని షాక్ తగిలింది. తోషాఖానా-2 కేసులో ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు శనివారం వారికి 17 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2021 మే నెలలో సౌదీ యువరాజు బహుమతిగా ఇచ్చిన అత్యంత ఖరీదైన 'బుల్గారీ జ్యువెలరీ సెట్'ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చాలా తక్కువ ధరకు సొంతం చేసుకున్నారనే ఆరోపణలు ఈ కేసులో రుజువయ్యాయి.

# మీ వల్లే గెలవాల్సిన చోట్ల ఓడిపోయాం

## సర్పంచ్ ఫలితాలపై 18 మంది ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ పెద్దలు సీరియస్

మొదటి పేజీ తరువాయి

ఇంకోసారి ఇలా రిపీట్ కావొద్దని నేతలకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెబల్స్ తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం వల్లే గెలవాల్సిన చోట్ల పార్టీ విఫలమైందని మండిపడినట్లు సమాచారం.

కాగా ఈ నెల 11, 14, 17 తేదీలలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పల్లెజనం అధికార కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు దక్కించుకుంది. మూడు విడతల్లో కలిపి కాంగ్రెస్ 7491 స్థానాలు, బీఆర్ఎస్ 3,494, 749 బీజేపీ, ఇతరులు 956 చోట్ల విజయం సాధించారు. ఈ ఫలితాల్లో అధికార పార్టీకి మూడింట రెండొంతుల సీట్లు దక్కించుకోగా మూడింట ఒకటో వంతు బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు.

# రైలు నుంచి జారిపడి నవ దంపతులు మృతి

మొదటి పేజీ తరువాయి

మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన కోరాడ సింహాచలం (25), అదే జిల్లా అంకవరం గ్రామానికి చెందిన భవాని (19)గా రైల్వే పోలీసులు గుర్తించారు

అయితే ఇద్దరూ గత రెండు నెలల క్రితమే వివాహం చేసుకున్నారు. సింహాచలం హైదరాబాద్ శివారులోని ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు దంపతులు సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రాత్రి బయలుదేరారు. రైలు వంగపల్లి రైల్వే స్టేషన్ దాటిన తర్వాత డోర్ వద్ద నిలబడి ఉన్న సమయంలో వారిద్దరూ ప్రమాదవశాత్తూ కింద పడిపోగా.. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను సొంత గ్రామాలకు తరలించనున్నారు.

# ఎంపీటీసీ-జడ్పీటీసీ ఎన్నికలపై సస్పెన్స్ పోటీకి సై అంటున్న నాయకులు

మొదటి పేజీ తరువాయి

కాగా, సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌లపై అసెంబ్లీలో చర్చించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో ఇప్పట్లో ఎన్నికలు ఉండవా? అంటూ గ్రామాల్లో చర్చ మొదలైంది. ఈనెలాఖరున అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. అప్పటి వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై సస్పెన్స్ కొనసాగే అవకాశం ఉందని తెలుస్తున్నది.

ఎన్నికలపై ఆచితూచి..

పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇప్పటికే ఎంపీటీసీల విభజనను పూర్తిచేశారు. దానికి అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేసింది. కానీ, వీటి కంటే ముందు ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలను నిర్వహించింది. సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో గ్రామీణ ప్రాంత నాయకులందరూ ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి ఉత్సాహంగా ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రత్యక్షంగా ప్రజల ఓట్ల ద్వారా జరుగుతాయి. అదే సమయంలో పార్టీ పరంగా, పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు అయినందున ఎవరికెన్ని ఓట్లు, సీట్లు వచ్చాయని ఓటర్లు క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది. వీరి ఎన్నిక తరువాత పరోక్ష ఎన్నిక విధానంలో ఎంపీపీ, జెడ్పీ చైర్మన్‌ల ఎన్నికలు జరుగుతాయి. ప్రత్యక్ష ఎన్నికలతో పాటు పరోక్ష ఎన్నికలను పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. అందుకే ఈ ఎన్నికలపై ఆచితూచి వ్యవహరించాలని ప్రభుత్వం, అధికార కాంగ్రెస్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.


మున్సిపోల్స్ ముందు జరిగేనా?

మరోవైపు ముందుగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారని బలమైన ప్రచారం జరుగుతోంది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి పట్టణ స్థానిక సంస్థలకు దాదాపు రూ.700 కోట్ల నిధులు రావాల్సి ఉంది. వీటిని సాధించుకోవాలంటే వచ్చే మార్చిలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి చివర్లో పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరితో జీహెచ్ఎంసీ పాలకవర్గం, వచ్చే మే నెలతో వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్?లాంటి పాలకవర్గాల గడువు ముగియనుంది. దీంతో వీటన్నంటిని ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తారా? లేక గతంలో లాగానే విడి విడిగా ఎన్నికలు నిర్వహిస్తారా? అనేది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. మున్సిపల్?ఎన్నికలకు సంబంధించిన కసరత్తును ఎన్నికల సంఘం ఇంతవరకు ప్రారంభించలేదు.

డెడికేషన్ నివేదికకు ఆమోదం తెలిపాకే..

మున్సిపల్ అధికారులు ఎక్కడైతే వార్డుల విభజన అవసరం ఉందో వాటిని కొన్ని నెలల క్రితమే పూర్తి చేశారు. సమీప గ్రామాలు మున్సిపాలిటీలో కలవడం, కొన్ని గ్రామాలు విడిపోవడం, కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు తదితర ప్రక్రియ నేపథ్యంలో వాటన్నంటిసీ సీడీఎంఏ అధికారులు పూర్తిచేశారు. ఎన్నికల సంఘం వార్డుల వారీగా ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాలను గుర్తించాల్సి ఉంది. వీటి ప్రక్రియకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. ఓటరు జాబితాను తయారు చేయడం కనీసం 10 రోజులు, ముసాయిదా తయారు చేయడం, దానిపై అభ్యంతరాలు, ఆల్ పార్టీ మీటింగ్‌లు నిర్వహించడం, తరువాత తుది జాబితా ప్రకటించడం చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించాల్సి ఉంది. వార్డు ఓటరు సంఖ్యకు అనుగుణంగా పోలింగ్?కేంద్రాలను తయారు చేయాలి. వీటికి కూడా వారం నుంచి 10 రోజుల సమయం పడుతుందని, రెండు ఒకేసారి చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. దీంతో ఎన్నికల సంఘం ఇప్పటికప్పుడు వీటి ప్రక్రియను ప్రారంభించినా సంక్రాంతి వరకు ఈ ప్రక్రియ సాగుతుందని అంచనా వేస్తున్నారు. మున్సి'పోల్స్' ను ప్రభుత్వం నిర్వహించాలనుకుంటే అంతకుముందు డెడికేటెడ్ కమిషన్ నివేదికను తెప్పించుకుని దానికి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఆ తర్వాతే జిల్లాల్లో రిజర్వేషన్‌లు ఖరారు చేసి గెజిట్ విడుదల చేస్తారు. అనంతరం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# తిరిగి పుంజుకుంటున్న రూపాయి.. ఒక్క రోజే 97 పైసలు జంప్



గత కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఒత్తిడిని ఎదుర్కొన్న భారత రూపాయి, ఎట్టకేలకు తిరిగి పుంజుకుంది. అమెరికన్ డాలర్ విలువ స్వల్పంగా బలహీనపడటం, దేశీయ మార్కెట్లలోకి పెట్టుబడులు తిరిగి రావడంతో రూపాయి మారకం విలువ ఒక్క రోజే 97 పైసలు బలపడింది. దీనితో ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89.27 వద్ద కొనసాగుతోంది. ఈ రికవరీ ఎగుమతిదారులు, దిగుమతి దారులకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది. అమెరికా ఆర్థిక విధానాల్లో మార్పులు. గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా మారడమే రూపాయి బలోపేతానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గత కొద్ది నెలలుగా రూపాయి విలువ చారిత్రాత్మక కనిష్ట స్థాయిలకు పడిపోయి ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఈ డిసెంబర్ నెలలోనే రూపాయి విలువ తొలిసారిగా రూ. 91 మార్కును దాటి 91.14 వద్ద ఆల్‌టైమ్ లో రికార్డును తాకింది. అమెరికా విధించిన 50 శాతం దిగుమతి సుంకాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడిదారుల ఉపసంహరణ రూపాయిని పాతాళానికి నెట్టాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సమయానుకూలంగా జోక్యం చేసుకుని డాలర్లను విక్రయించడం, తాజాగా డాలర్ ఇండెక్స్ తగ్గడంతో రూపాయి మళ్ళీ 90 మార్కు దిగువకు చేరి బలమైన స్థితిలోకి రావడం విశేషం.

## దేశంలో ఎక్కడా ఇంత గొప్ప కార్యక్రమం లేదు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి రెండవ వార్షికోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను విని వాటికి పరిష్కారం చూపే ఈ ప్రజావాణి కార్యక్రమం నిజమైన ప్రజా పరిపాలనకు ప్రతిరూపమన్నారు. దేశంలో ఇంత సమర్థంగా ప్రజా గోడు విని పరిష్కరిస్తున్న కార్యక్రమం ఎక్కడా లేదని తెలిపారు. ఇప్పటివరకు అందిన ప్రజావాణి దరఖాస్తుల్లో 74% సమస్యలు పరిష్కారమవడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ క్రమంలో కృషి చేసిన అధికారులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాంకేతిక సహకారంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా ప్రజావాణి కొనసాగుతుంది. ప్రజల మేలు కోసం రాష్ట్రంలోని ప్రతి వ్యవస్థ పనిచేయడం మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ ప్రజలు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆసిఫాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్య

పంట దిగుబడి రాక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆసిఫాబాద్ మండలంలోని ఇదూలవాడ గ్రామానికి చెందిన ఉప్పరి లచ్చయ్య(56), చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లచ్చయ్య తనకున్న పొలంలో పత్తి పంట సాగు చేయగా.. అధిక వర్షాల కారణంగా అనుకున్న స్థాయిలో దిగుబడి రాక.. పంటకు పెట్టిన పెట్టుబడి ఖర్చు రాదని వేదనతో తరుచూ మద్యం సేవించేవాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## సంచలనం.. ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష

మొదటి పేజీ తరువాయి

రావల్పిండిలోని అడియాలా జైలులో జరిగిన విచారణ అనంతరం స్పెషల్ జడ్జ్ షారుఖ్ అర్జుమంద్ ఈ తీర్పును వెలువరించారు. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఇప్పటికే జైలులో ఉండగా, ఈ తాజా శిక్ష ఆయన రాజకీయ భవిష్యత్తుపై మరింత ప్రభావం చూపనుంది.

జైలు శిక్షతో పాటు, కోర్టు ఈ దంపతులిద్దరికీ కలిపి 1.64 కోట్ల పాకిస్థానీ రూపాయల భారీ జరిమానాను కూడా విధించింది. నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనల్లో లభించే ఖరీదైన బహుమతులను తోషాఖానా (ప్రభుత్వ ఖజానా)లో జమ చేయాల్సి ఉండగా, వాటి విలువను తక్కువ చేసి చూపడం ద్వారా ప్రభుత్వానికి భారీ నష్టం చేకూర్చారని ప్రాసిక్యూషన్ వాదించింది. ఈ తీర్పుపై ఇమ్రాన్ ఖాన్ తరపు న్యాయవాదులు పైకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉంది. ఈ పరిణామంతో పాకిస్తాన్ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. కాగా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

## దీపు చంద్ర దాస్ హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్: బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు!

మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో వేగంగా దర్యాప్తు చేపట్టిన రాపిడ్ యాక్షన్ బెటాలియన్ (రాబ్ -14) వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఏడుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసింది. నిందితులను ఎండీ లిమన్ సర్కార్, ఎండీ తారెక్ హొస్సేన్, ఎండీ మానిక్ మియా, ఎర్షాద్ అలీ, నిజుమ్ ఉద్దీన్, అలోంగిర్ హొస్సేన్, ఎండీ మిరాజ్ హొస్సేన్ అకాన్‌గా గుర్తించారు.

ఈ ఘటనపై మహమ్మద్ యూనస్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "కొత్త బంగ్లాదేశ్‌లో ఇటువంటి హింసకు తావు లేదు" అని స్పష్టం చేశారు. బాధితుడు దీపు చంద్ర దాస్ స్థానిక వస్త్ర కర్మాగారంలో పనిచేసే సామాన్య కార్మికుడని, అకారణంగా అతడిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు పాల్పడ్డారని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రూరమైన నేరానికి పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచిపెట్ట బోమని, దోషులందరికీ కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాద మూకల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

# సౌదీ బస్సు ప్రమాదం.. పరిహారం విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

సౌదీ అరేబియా లో నవంబర్ 17న జరిగిన ఘోర ప్రమాదం హైదరాబాద్‌లోని పలు కుటుంబాల్లో అంతులేని విషాదం మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో మొత్తం 45 మంది సజీవ దహనం కాగా.. హైదరాబాద్‌లోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని రెండేళ్ల నుంచి 12 ఏళ్ల లోపు చిన్నారులంతా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3.07 మంజూరు చేశారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి జీవో నం.125 ద్వారా నిధుల మంజూరుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా, ఈ మొత్తాన్ని తెలంగాణ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాతా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫతే మైదాన్ బ్రాంచ్‌లో జమ చేయాలని సీఎంవో అధికారులు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఒకే వ్యక్తి నాలుగు సార్లు ఓటు.. సర్పంచ్ ప్రమాణ స్వీకారానికి అడ్డుపడతామంటూ పార్టీ ఆగ్రహం

సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రత్యర్థి శివకుమారి లీగల్ సెల్ కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మండలంలోని ముస్లాయి పల్లి గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పై కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర ఒక్క ఓటుతో గెలవడం జరిగింది. దీనిపై అప్పుడే రీకౌంటింగ్ చేయమని కోరిన అధికారులు పట్టించుకోలేదని.. ఒక వ్యక్తి రెండు వార్డుల్లో నాలుగు ధపాలుగా ఓట్లు వేసినట్టుగా దృష్టికి వచ్చిందని ఈ విషయంపై ఎన్నికల అధికారికి, జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

సీసీ కెమెరాల అబ్జర్వేషన్ ఉన్నందున దాని ఆధారంగా ఒక మహిళ నాలుగు సార్లు ఓటేసినట్టుగా అక్కడున్న తమ పార్టీ పోలింగ్ ఏజెంట్ చెబుతున్నారని అందుకు సాక్ష్యంగా సేకరించమని లీగల్ సెల్ కు శుక్రవారం రోజు సమర్పించామని సర్పంచ్ ప్రమాణ స్వీకారం చేయకుండా లీగల్‌గా పోరాడుతామని, బీఆర్ఎస్ పార్టీ వర్గీయులు అంటున్నారు.

## ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై టీ బీజేపీ రాంచందర్ రావు కౌంటర్

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై పెరుగుతున్న హింసను ఖండిస్తూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు పడుతున్న బాధల గురించి ప్రియాంక గాంధీ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా ఇటువంటి ప్రకటన చేయడం చూస్తుంటే, ఇప్పటికైనా వారికి హిందువుల కష్టాలు అర్థమైనందుకు సంతోషంగా ఉందని ఎద్దేవా చేశారు. నిజానికి కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ హిందూ ధర్మం పై దాడి చేసేవారికి, భారతీయ మూలాలకు వ్యతిరేకంగా ఉండేవారికే మద్దతు ఇస్తుంటారని ఆయన ఆరోపించారు. బంగ్లాదేశ్ హిందువుల భద్రత గురించి మాట్లాడటమే కాకుండా, మన దేశంలోకి అక్రమంగా చొరబడుతున్న బంగ్లాదేశీయులను కూడా ప్రియాంక గాంధీ వ్యతిరేకించాలని రాంచందర్ రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. భారత ఓటర్ల జాబితా నుంచి అక్రమ వలసదారుల పేర్లను తొలగించడానికి ఆమె మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే భారత్‌లో అశాంతిని సృష్టించడానికి ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ ఉగ్రవాదులను, ఇతర ఉగ్రవాద మూలాలను కాంగ్రెస్ నాయకులు ఖండించాలని, అటువంటి శక్తులను ప్రోత్సహించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## రైజింగ్ కాదు ఫ్లయింగ్ సీఎం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు సెటైర్లు

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి.. ఎప్పుడైనా నీ మొహానికి వ్యవసాయం చేసావా? రైతుల కష్టం మీకు తెలుసా? కేసీఆర్ హయాంలో కరెంటు ఫుల్లు. నీళ్లు ఫుల్లు. ఎరువులు ఫుల్లు. రేవంత్ రెడ్డి వచ్చాక రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు, కరెంటు 14 గంటలు కూడా రావడం లేదు, ఎరువుల కోసం లైన్ లో నిలబడి నిలబడి గోసపడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎరువుల లారీలను ఊర్లకే పంపి రైతులకు అందిస్తే, రేవంత్ రెడ్డి వచ్చాక ఎరువుల కోసం గంటల తరబడి లైన్ లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. యాసంగి బోనస్, రెండు పంటల రైతుబంధు ఎగ్గొట్టారని రుణమాఫీ సగం మందికి కూడా చేయలేదని దుయ్యబట్టారు.

మున్సిపాలిటీల టైం అయిపోయి సంవత్సరం అవుతున్నా ఎన్నికలు పెట్టట్లేదు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎందుకు పెట్టట్లేదు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి ఓడిపోతాననే భయం పట్టుకుందని కోపరేటివ్ ఎలక్షన్ పెట్టమంటే కూడా కాంగ్రెస్ నాయకులను నామినేట్ చేసుకుందామని జీవో ఇచ్చారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి నీకు ధైర్యం ఉంటే, నువ్వు రైతులకు మేలు చేసేటోడివే అయితే కోపరేటివ్ ఎన్నికలు పెట్టు. ఎందుకు నామినేట్ చేస్తున్నావ్. నువ్వు ఎరువులు ఇయ్యలేదు. నువ్వు రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఎగ్గొట్టినవ్. బోనస్ డబ్బులు ఇయ్యలేదు. పంటల బీమా చేయలేదు కనుక ఎలక్షన్ పెట్టట్లేదన్నారు.

15వ ఆర్థిక సంఘం డబ్బులు 85 శాతం ఢిల్లీ నుంచి గల్లికే వస్తాయన్నారు. రేవంత్ రెడ్డి, మంత్రులు ఆపలేరు. ఎమ్మెల్యే ఆపలేడు. డైరెక్ట్ సర్పంచుల ఖాతాల్లో పడతాయన్నారు. ర్పంచ్ ఎంత పవర్ఫుల్ అంటే ఎమ్మెల్యేకి చెక్ పవర్ లేదు. మంత్రికి చెక్ పవర్ లేదు. ముఖ్యమంత్రికి చెక్ పవర్ లేదు. కానీ గ్రామ సర్పంచ్ కు చెక్ పవరుందన్నారు. ధైర్యంగా పని చేయండి. త్వరలో గెలిచిన సర్పంచ్ లకు శిక్షణ కార్యక్రమాలు పెడతామన్నారు. సర్పంచ్ విధివిధానాలు, బాధ్యతలపై ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఏమున్నా రెండేళ్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటది. మీరు ఐదేళ్ల కోసం సర్పంచ్ గా గెలిచారు. ఓడిపోయిన వారికి భవిష్యత్తు ఉంటది. గెలిచిన వారికి బాధ్యత ఉంటుంది.

గవర్నమెంట్ ఖజానా నుంచి ఐదు కోట్లతో సొంతంగా ఫుట్ బాల్ గ్రౌండ్ కట్టుకున్నాడు. నీ సొంత డబ్బుతో కట్టుకో రేవంత్ రెడ్డి. ప్రభుత్వ సొమ్ముతో జల్సాలు చేయడం కాదన్నారు. సింగరేణి సీఎస్సార్ డబ్బులతో కేసీఆర్ స్కూళ్లు కట్టించిండు. రోడ్లు ఏపించిండు. మెడికల్ కాలేజీలు పెట్టించిండు. కొత్త జిల్లాలు చేయాలి. కొత్త మెడికల్ కాలేజీ చేయాలి. మండల కేంద్రానికి రోడ్లు వేయాలని కేసీఆర్ పని చేస్తే రేవంత్ రెడ్డి ఏమో అందాల పోటీలు, ఫుట్ బాల్ మ్యాచ్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో సోకులు చేయాలి. ఢిల్లీకి హైదరాబాద్ కి చక్కర్లు కొట్టాలన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## 21 సీట్లలో పోటీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి డెల్టా ప్రాంతంలోని ఐదు జిల్లాలు (తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఏలూరు, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ) ప్రయోజనం పొందనున్నాయి. కేవలం గోదావరి జిల్లాల కోసమే రూ. 3,050 కోట్లను కేటాయించారు. ధవళేశ్వరం, బొబ్బర్లంక, వేమగిరి వద్ద గోదావరి జలాలను సేకరించి, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ప్రతి ఇంటికీ సరఫరా చేయనున్నారు. జల్ జీవన్ మిషన్ నిధులతో చేపడుతున్న ఈ బృహత్తర ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ పథకానికి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జ్ఞాపకార్థం 'అమరజీవి జలధార' అని పేరు పెట్టడం విశేషం.

అలాగే గత అసెంబ్లీ ఎన్నికలై సమయంలో తనపై వచ్చిన ఆరోపణలపై పవన్ స్పందిస్తూ.. తాను జనసేన పార్టీ పెట్టి 10 సంవత్సరాలు పూర్తి అయిందని, గత ఎన్నికల్లో తాను టికెట్లు అమ్ముకున్నానని తీవ్రంగా విమర్శించారని గుర్తు చేశారు. కానీ తాను కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం తాను ఈ నిర్ణయం తీసుకున్నాని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాగే ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కొందరు గుండాగిరి చేస్తున్నారని అలాంటి వారి ఆటలు కట్టించేందుకు తమకు రెండు రోజుల చాలని, కాళ్లు, చేతులు తీసేస్తే ఆకు రౌడీలు దారిలోకి వస్తారని, ఇలాంటివారికి సీఎం యోగి ట్రీట్మెంట్ కరెక్ట్ అని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# తండ్రిపై రూ.3 కోట్ల బీమా చేశారు.. పాముకాటుతో చంపించారు

తండ్రికి పెద్ద మొత్తంలో బీమా చేయించారు. ఆ తర్వాత పథకం ప్రకారం ఆయన్ను పాముతో కాటేయించారు. ప్రమాదంగా చిత్రీకరించి ఇన్సూరెన్స్ డబ్బును క్లెయిమ్ చేసుకుందామని అనుకున్నారు. అయితే వారిపై బీమా సంస్థ అధికారికి అనుమానం రావడంతో అసలు విషయం బయటపడింది. కాసుల కక్కుర్తితో కన్నతండ్రినే కుమారులు చంపేశారని తేలింది. ఈ అమానుష ఘటన తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో జరిగింది.

తిరువళ్లూరు జిల్లా తిరుత్తని సమీపంలోని పొదట్టూర్‌పెట్టయ్‌కి చెందిన గణేశన్ (56).. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 22న తన నివాసంలో పాముకాటుతో చనిపోయారు. అంత్యక్రియల అనంతరం మృతుడి పేరు మీద చేయించిన రూ.3 కోట్ల బీమా డబ్బుల కోసం అతడి ఇద్దరు కుమారులు ఇన్సూరెన్స్ కంపెనీనీ ఆశ్రయించారు. దీంతో వారికి అనుమానం రావడంతో విచారణ జరిపారు. గణేశన్‌పై అధిక విలువ గల అనేక పాలసీలు ఉండడం, తండ్రి మరణించి వారం తిరగకుండానే ఇన్సూరెన్స్ కోసం క్లెయిమ్ చేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

దీంతో కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో ఈ కేసు మరో మలుపు తిరిగింది. గణేశన్ కుమారులు మోహన్‌రాజ్ (26), హరిహరన్ (27) ప్రైవేట్ ఉద్యోగులు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడి నష్టపోయారు. దీంతో అప్పుల నుంచి ఎలాగైనా బయటపడాలనుకున్న అన్నదమ్ములు.. పథకం ప్రకారం తండ్రి పేరుపై రూ.3 కోట్ల బీమా చేయించారు. అనంతరం ప్రమాదవశాత్తూ తమ తండ్రి చనిపోయినట్లు నమ్మించడానికి పాము కాటుతో చంపాలని కుట్ర పన్నారు.

ప్లాన్ ప్రకారం స్నేహితుల సహాయంతో ఒక పామును తమ తండ్రి నిద్రిస్తున్న సమయంలో ఆయన పక్కన వదిలారు. అది కాలుపై కరవడంతో ఆయన నొప్పితో అరిచారు. దీంతో స్థానికులు దవాఖానకు తరలించిం రక్షించారు. తమ ప్రయత్నం ఫలించకపోవడంతో వారం రోజుల తర్వాత మరో అత్యంత విషపూరితమైన పామును తీసుకువచ్చి.. గణేశన్ నిద్రపోతున్న సమయంలో అతడి మెడపై కాటు వేయించారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా చిత్రీకరించేందుకు పామును అక్కడే చంపేశారు. అయితే అతడిని దవాఖానకు తరలించే విషయంలో నిందితులు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. దీంతో వారితోపాటు వాళ్లకు సహకరించిన మరో నలుగురిని అరెస్టు చేశారు.

# కాంగ్రెస్‌కు మిగిలేది శూన్యహస్తమే మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆసక్తికర వ్యాఖ్యలు




రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఇవాళ ఆయన యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల వచ్చిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ కు చెంపపెట్టు అని ఎద్దేవా చేశారు. వెయ్యిలోపు ఓట్లు ఉన్న గ్రామాల్లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారని అన్నారు. మేజర్ పంచాయతీలన్నీ బీఆర్ఎస్ పార్టీనే కైవసం చేసుకుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో హస్తం పార్టీకి శూన్య హస్తమే మిగులుతుందని జోస్యం చెప్పారు.

# స్వర్ణ గిరి దేవాలయంలో శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి జిల్లా: యాదాద్రి భువనగిరి స్వర్ణ గిరి దేవాలయంలో శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం.అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం.శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయణం పుష్య మాసం కృష్ణ పక్షము హేమంత ఋతువు అమావాస్య శనివారము డిసెంబర్ 20వ తేది.కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది.ఈరోజు 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు.ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రం లో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు,సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు.ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయమే శ్రీ ఆండాళ్ అమ్మవారికి నవ కలశ పూర్వకంగా పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భూదేవి అంశగా జన్మించిన ఆండాళ్ అమ్మవారికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీమాన్ మానేపల్లి రామారావు కుటుంబ సభ్యుల తరపున అర్చకులు చీర సారె లను తిరుమాడ వీధులలో ఊరేగించి, సమర్పించారు.




ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్నఖచిత స్వర్ణాభరణాలతో,పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని ఆర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు శ్రీవారిని నయనానందకరంగా దర్శించుకున్నారు.స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్లో రిటైల్,హెూల్సేల్ వ్యాపారుల మధ్య ఘర్షణ



ఇది కాద నిజం,హైదరాబాద్: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్లో తెల్లవారుజామున రిటైల్– హెూల్సేల్ వ్యాపారుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. హెూల్సేల్ వ్యాపారులు రిటైల్గా అమ్మకాలు చేయడంతో తమ వ్యాపారం నష్టపోతుందని రిటైల్ వ్యాపారులు ఆరోపించారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాకపోవడంతో రిటైల్ వ్యాపారులు హెూల్సేల్ మార్కెట్లోనే వ్యాపారం చేసేందుకు రావడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న గుడిమల్కాపూర్ పోలీసులు ఇరువర్గాలను సముదాయించి త్వరలో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రిటైల్ వ్యాపారులకు మద్దతుగా వచ్చిన కార్వాన్ బీఆర్ఎస్ ఇంచార్జ్ జీవన్ సింగ్ను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప వాగ్వాదం జరిగింది.

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శించుకున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరము కృష్ణారావు



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరము కృష్ణారావు యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

దర్శనం అనంతరం ఎమ్మెల్యే మాధవరము కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, సమృద్ధిగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి, పోలీస్ కమిషనర్.



ఖమ్మం,20 డిసెంబర్ (ఇది కద నిజం):నేడు (21 వ తేదీన) జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ, ఆర్థిక భారంతో పాటు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువైపుల సమ్మతితో సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం మరియు కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు,వినియోగించుకోవాలని సూచించారు.

# యాదగిరిగుట్టలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భ్రమరి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీమతి సునీత (హైదరాబాద్) కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. స్వామివారి మహిమను ప్రతిబింబించే శాస్త్రీయ నృత్య రూపకాలతో కూడిన ఈ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సంప్రదాయ వేషధారణ, లయబద్ధమైన అడుగులు, భావ వ్యక్తీకరణతో శ్రీమతి సునీత అందించిన కూచిపూడి నృత్యం భక్తుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన భక్తులు కళాకారిణి ప్రతిభను అభినందించారు. ఆలయ అధికారులు, కళాభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భాగ్యరథి విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ ఫ్రెషర్స్ పార్టీ & గెట్ టుగెదర్




ఇది కద నిజం, హైదరాబాద్:భాగ్యరథి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఫ్రెషర్స్ పార్టీ & గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్మెంట్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఫ్రెషర్స్ను ఉద్దేశించి మాట్లాడిన మేనేజ్మెంట్ ప్రతినిధులు, ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ రెండు సంవత్సరాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్న కాలమని తెలిపారు. విద్య అనేది కేవలం మార్కులకే పరిమితం కాదని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలే నిజమైన విద్యకు ప్రతీకలని పేర్కొన్నారు. భాగ్యరథి విద్యాసంస్థలు విద్యార్థుల చదువుతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నాయని స్పష్టం చేశారు. భాగ్యరథి విద్యాసంస్థల చైర్మన్ నెవలి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు మేనేజ్మెంట్ ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించారు. నీట్ (NEET) పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు రూ.50,000 నగదు బహుమతి, అలాగే ఐఐటీ (IIT), ఎన్ఐటీ (NIIT) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీటు సాధించిన విద్యార్థులకు రూ.25,000 నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతాయని అన్నారు. సీనియర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జూనియర్స్కు ఆదర్శంగా నిలవాలని, తమ క్రమశిక్షణ, ప్రవర్తన, విజయాల ద్వారా వారికి మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. జూనియర్స్కు స్నేహితులుగా, ప్రేరణగా నిలవాలని కోరారు. గెట్ టుగెదర్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఒక కుటుంబంలా కలిసి ఆనందాన్ని పంచుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ మల్లేష్ పాల్గొని, విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి సారించాలని సూచించారు. బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, లక్ష్య నిర్ధారణ అలవాటు చేసుకోవాలని, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే నిరంతర కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల సతీష్, శౌంటి రెడ్డి, పున్నా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగు వెంకట్, దుర్గా రావు, నాగబాబు, కల్కి మూర్తి, అలాగే సీనియర్ జర్నలిస్టులు పాల్గొని విద్యార్థులకు విలువైన సందేశాలు అందించారు.




భాగ్యరథి విద్యాసంస్థల డైరెక్టర్లు గంధం రమేష్ బాబు, కూచిపూడి రామకృష్ణ, నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయంలో మేనేజ్మెంట్ ఎప్పుడూ భాగస్వామిగా ఉంటుందని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించడం భాగ్యరథి సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు మేనేజ్మెంట్ అభినందనలు తెలిపింది. కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా, ఉత్సాహభరితంగా సాగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. చివరగా విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు కావాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం ముగిసింది.

# ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి, కొడుకు మరణంతో తట్టుకోలేక తండ్రి మృతి

ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం నెమిల గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మోత్కుపల్లి బాలకిషన్ (33) పచ్చకామెర్లతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఇటీవల వార్డు మెంబర్ గా గెలవడంతో ఆ ఎన్నికల బిజీలో అనారోగ్య సమస్యను తీవ్రంగా పట్టించుకోకపోవడంతో మృత్యువు ఒడిలోకి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి అంత్యక్రియలు కాకముందే మృతుని తండ్రి మోత్కుపల్లి ఐలయ్య (60) కళ్ల ముందు కొడుకు మృతి తట్టుకోలేక గుండెపోటుతో రాత్రి మృతి చెందాడు.

# అంచనాలు నిజమయ్యాయి



'మోగ్లీ' చిత్రానికి విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి ఆదరణ లభిస్తున్నదని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో సాయిదుర్గతేజ్ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన తన ఫేవరేట్ క్యారెక్టర్ అయిన మోగ్లీ పేరుతో ఈ సినిమా రావడం ఆనందంగా ఉందని, రోషన్ కష్టపడి కెరీర్‌ను బిల్డ్ చేసుకుంటున్నారని అన్నారు. ఈ సినిమా తమ అంచనాల్ని నిజం చేసిందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం తాను వందశాతం ఎఫర్ట్స్ పెట్టానని హీరో రోషన్ కనకాల అన్నారు.

# వైకుంఠ ఏకాదశి ఉత్సవాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం: జీవన్ సింగ్ ఆగ్రహం

ఇది కద నిజం,హైదరాబాద్:జియాగూడలోని ప్రసిద్ధ రంగనాథ స్వామి దేవాలయంలో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని జీవన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులే స్వయంగా హాజరై సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించేవారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. భక్తులకు సౌకర్యాలు, భద్రత, రవాణా, తాగునీరు వంటి మౌలిక వసతులు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తామని జీవన్ సింగ్ హెచ్చరించారు. దేవాలయ ఉత్సవాల నిర్వహణకు తక్షణమే ప్రభుత్వం స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



# భూపాల్ పల్లి లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం





ఇది కద నిజం: ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా, ఈ దేవస్థానం సనాతన ధర్మం యొక్క మహత్తును, హిందూ ఆచారాలు–సంప్రదాయాలను మరియు భక్తి తత్వాన్ని ప్రజలలో మరింత లోతుగా నాటేందుకు లక్ష్యంగా పెట్టుకొని, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రచార రథం ద్వారా వివిధ గ్రామాలు, పట్టణాలు మరియు మారుమూల ప్రాంతాలలో విస్తృతంగా పర్యటిస్తోంది. ఈ ప్రచార రథం ద్వారా శ్రీ స్వామి వారి విశిష్టత, ధార్మిక సందేశాలు, భక్తి గీతాలు మరియు ఆధ్యాత్మిక ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో ధార్మిక చైతన్యం పెంపొందించబడుతోంది. ఈ క్రమంలో, ఈ రోజు భూపాలపల్లిలో ఈ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, భక్తి శ్రద్ధలతో మరియు ఘనంగా నిర్వహించబడింది. వేదోక్త విధానాలు, ఆగమ శాస్త్రోక్త నియమాలను అనుసరించి, మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణలు మరియు సంప్రదాయ ఆచారాలతో ఈ కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భూపాలపల్లి పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి దివ్య దర్శనం చేసుకొని, కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి అపార కృపాశీస్సులను పొందారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, కార్యక్రమం ప్రశాంతంగా మరియు సక్రమంగా నిర్వహించబడింది. ఈ దేవస్థానానికి చెందిన అర్చక స్వాములు, వేద పండితులు మరియు సిబ్బంది సమన్వయంతో, శాస్త్రోక్తంగా మరియు అత్యంత వైభవంగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు. ఇట్టి కళ్యాణ నిర్వహణకు ఈ దేవస్థానము ద్వారా శ్రీ పి. నవీన్, సహాయ కార్యనిర్వహనధికారి గారు నోడల్ అధికారిగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసన సభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ, ఐఎఎస్ గారు మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరై స్వామి వారి దివ్య కళ్యాణాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, భూపాలపల్లిలో జరుగుచున్న శ్రీ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవమునకు సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీ రాజేశ్వర్ రెడ్డి గారు పట్టు వస్త్రాలు సమర్పించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు. మరియు ఇట్టి కార్యక్రమములో జిల్లా దేవాదాయ శాఖ అధికారులు,సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంపై స్థానిక భక్తులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ దేవస్థానం చేపడుతున్న ధార్మిక సేవలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మరిన్ని ప్రాంతాలలో ప్రచార రథం ద్వారా స్వామి వారి కళ్యాణాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఎస్. వెంకట్ రావు గారు ఈ సందర్భంగా తెలియజేశారు.

# విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీకి బెంగాల్ జట్టు..

## చోటు దక్కించుకున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ



స్పోర్ట్స్ న్యూస్, 20 డిసెంబర్ (ఇది కద నిజం ): విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ కోసం బెంగాల్ జట్టును ప్రకటించారు. చాలాకాలంగా జాతీయ జట్టుకు దూరమైన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ బెంగాల్ జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గాయం నుంచి కోలుకుతున్న తర్వాత బెంగాల్ తరపున దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. ప్రస్తుతం దేశవాళీ సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 36 వికెట్లు పడగొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. దేశవాళీ సీజన్ రంజీ ట్రోఫీతో ప్రారంభమైంది.

ఇందులో షమీ నాలుగు మ్యాచ్‌లలో 18.60 సగటుతో 20 వికెట్లు తీశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్‌లోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఏడు మ్యాచుల్లో 14.93 సగటుతో 16 వికెట్లు పడగొట్టాడు. బెంగాల్ జట్టులో భారత పేసర్లు ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్ సైతం చోటు దక్కించుకున్నారు. విజయ్ హజారే ట్రోఫీ కోసం బెంగాల్ జట్టు బాధ్యతలు అభిమన్యు ఈశ్వరన్‌కు అప్పగించారు. బెంగాల్ ఎలైట్ గ్రూప్–బీలో ఉంది. డిసెంబర్ 24న రాజ్‌కోట్‌లో విదర్భతో తొలి మ్యాచ్ ఆడనున్నది. ఇదే గ్రూప్‌లో అసోం, బరోడా, జమ్మూ కశ్మీర్, హైదరాబాద్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్ జట్లు ఉన్నాయి.

విజయ్ హజారే ట్రోఫీకి బెంగాల్ జట్టు

అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), అనుస్తుప్ మజుందార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), సుదీప్ ఘరామి, సుమంత్ గుప్తా, సుమిత్ నాగ్ (వికెట్ కీపర్), చంద్రహాస్ డాష్, షాబాజ్ అహ్మద్, కరణ్ లాల్, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్, సయన్ ఘోష్, రవి కుమార్, అమీర్ ఘనీ, విశాల్ భాటి, అంకిత్ మిశ్రా.

# ఆత్మసాక్షాత్కారానికి ప్రాథమిక మార్గం క్రియాయోగం

## ప్రపంచ ధ్యాన దినోత్సవంపై ప్రత్యేక కథనం!



ఇది కద నిజం, హైదరాబాద్: ఏటా డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించినప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ధ్యానంపై ఆసక్తి పెరుగుతోంది.ధ్యానాన్ని భగవంతుడ్ని చేరే మార్గంగా ఆధ్యాత్మికవేత్తలు నిర్వచిస్తుంటారు. ప్రతిరోజూ కొంచెం సమయమైనా ధ్యానంలో గడిపే సులభమైన అభ్యాసం ద్వారా మనం మన ప్రశాంతత స్థాయిలను, శారీరక ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగు పరుచుకోగలుగుతాం.పశ్చిమ దేశాలలో యోగ పితామహునిగా విస్తృతంగా గుర్తింపు పొందిన, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన "ఒక యోగి ఆత్మకథ" (Autobiography of a Yogi) గ్రంథ రచయిత అయిన పరమహంస యోగానంద, మానవులందరికీ ధ్యానం అత్యంత ప్రాముఖ్యత కలిగినదని నొక్కి చెప్పారు. క్రియాయోగం లాంటి శాస్త్రీయ ధ్యాన మార్గాన్ని అనుసరించడం వల్ల – ఉన్నత ఆత్మతో అనుసంధానం చెందుతాం. క్రియా యోగం ఒక సమగ్రమైన, వైజ్ఞానిక, సర్వవ్యాప్త పద్ధతి. ప్రతి వ్యక్తి సంపూర్ణ మానసిక శాంతిని పొందడం వైపు అభివృద్ధి సాధిస్తాడు. అంతే కాకుండా, క్రియాయోగ ధ్యాన పద్ధతి, దాని అనుబంధ పద్ధతులు శరీరం, మనస్సు, ఆత్మకు ఎంతో అవసరమైన పునరుజ్జీవనాన్ని అందిస్తాయి.

'యోగ' అనే పదం వాస్తవానికి భగవంతునితో ఐక్యాన్ని సూచిస్తుంది. యోగ మార్గంలో ధ్యాన సాధన ఒక అంతర్భాగం. పరమహంస యోగానంద ద్వారా 1917లో స్థాపించబడిన యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వై.ఎస్.ఎస్.) , ఆ మహాగురువు ఉపదేశించిన క్రియాయోగ బోధనలను వ్యాప్తి చేస్తుంది. ఈ బోధనలు ఆత్మసాక్షాత్కారం అనే ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి ప్రాథమిక మార్గంగా క్రమం తప్పకుండా చేసే గాఢమైన ధ్యానానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తాయి. 'ఒక యోగి ఆత్మకథ'లో, పరమహంస యోగానంద క్రియాయోగ ధ్యాన విజ్ఞానం అన్ని ఇతర ఆధ్యాత్మిక సాధనా పద్ధతుల కంటే ఉన్నతమైనదని, భక్తితో కూడినప్పుడు, అది అంతిమ లక్ష్యాన్ని సాధించడంలో ఖచ్చితంగా సఫలం అవుతుందని పేర్కొన్నారు! ధ్యానాన్ని తమ దైనందిన దినచర్యలలో చేర్చుకోవడంలో వాయిదా వేసేవారు వివిధ రకాల వృత్తినిపుణులు తీవ్రంగా పొరపాటుపడ్డారు. తీరిక లేని జీవితానికి, అనివార్యంగా దానితో పాటు వచ్చే ఒత్తిడులను మెరుగ్గా ఎదుర్కోవడానికి ధ్యాన సాధన మరింత అవసరం.

హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం క్రమం తప్పకుండా ధ్యానం చేసే సీఈఓలు వారి వృత్తి జీవితంలో కూడా స్పష్టంగా మరింత విజయవంతంగా ఉంటారని వెల్లడించింది. ఆధునిక మనస్తత్వ సంపూర్ణ ఆరోగ్య నిపుణులు కూడా ఆరోగ్యకరమైన, సంతోషకరమైన, సంతృప్తికరమైన జీవితాలను గడపడానికి ధ్యానాన్ని ఒక అద్భుతమైన మార్గంగా ప్రతిపాదిస్తారు. ఇప్పటికే నిరంతర ఆధ్యాత్మిక సాధనను అత్యంత ప్రాధాన్యతగా ఎంచుకున్న వారికి, వారు గాఢంగా ధ్యానం చేయడానికి ఎంత ఎక్కువ సమయం కేటాయించగలిగితే అంత మంచిది. సంవత్సరాల తరబడి చేసే ధ్యానం ప్రతి మానవుడిని మరింత ఉల్లాసంగా, సమతుల్యంగా, సమర్థవంతంగా. శారీరకంగా కూడా ఆరోగ్యంగా మారుస్తుంది, ఇది నిశ్చయం. పరమహంస యోగానంద గుర్తుండి పోయేలా ఇలా అన్నారు, "ఇది వేచి ఉండగలదు, అది వేచి ఉండగలదు, కానీ భగవంతుని కోసం మీ అన్వేషణ ఆగకూడదు!" ఆ అన్వేషణను వేగవంతం చేసే మార్గం ధ్యానమే పరమహంస యోగానందకు గురువైన స్వామి శ్రీయుక్తేశ్వర్ గిరిగా ప్రసిద్ధి చెందిన వారు, ఎంతో స్ఫూర్తిదాయకంగా ధ్యానం గురించి చెప్పారు: "మీరు ఇప్పుడు ఆధ్యాత్మిక ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో ప్రతిదీ మెరుగుపడుతుంది" ఈ జీవితంలో శాశ్వత శాంతిని, ఆనందాన్ని మనం కనుగొనాలంటే ధ్యానం ఒక ఐచ్ఛిక కార్యం కాదని, అది మన జీవితాలలో తప్పనిసరి చర్య అని ప్రపంచ ధ్యాన దినోత్సవం మనందరికీ గుర్తుచేసే విధంగా ఉండాలి.

# టీ20 ప్రపంచకప్ జట్టులో శుభ్‌మన్ గిల్‌కు దక్కని చోటు..




స్పోర్ట్స్ న్యూస్, 20 డిసెంబర్ (ఇది కద నిజం ): భారత జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్‌కు టీ20 ప్రపంచకప్ కప్‌లో చోటు కోల్పోయాడు. టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న గిల్‌కు ఐసీసీ ఈవెంట్‌లో చోటు దక్కకపోవడం అందరినీ షాక్‌కు గురి చేసింది. వాస్తవానికి ఇటీవల గిల్ టీ20ల్లో పేలమైన ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. గాయం కారణంగా ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 మ్యాచ్‌కు సైతం దూరమైన విషయం తెలిసిందే. గిల్ స్థానంలో బ్యాట్స్‌మెన్–వికెట్ కీపర్ సంజూ శాంసన్ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. శాంసన్ అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించి.. జట్టుకు శుభారంభం అందించాడు. ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. టీమిండియా భారీ స్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఓపెనర్‌గా తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకున్నాడు.

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు వరకు టీ20 జట్టులో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా కొనసాగగా.. గిల్ స్థానంలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలను అక్షర్ పటేల్‌కు బీసీసీఐ అప్పగించింది. అదే సమయంలో జాతీయ జట్టుకు దూరమైన వికెట్ కీపర్–బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్‌తో పాటు రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిసారిగా నవంబర్ 28, 2023న ఆస్ట్రేలియాపై భారత్ తరపున ఆడాడు. అదే అతని చివరి అంతర్జాతీయ మ్యాచ్ కూడా. మరోవైపు, రింకు ఆసియా కప్‌లో భాగంగా ఉన్నాడు, కానీ ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లలో చోటు దక్కని విషయం తెలిసిందే.అయితే, ప్రపంచకప్‌కు గిల్‌ను ఎంపిక చేయకపోవడంతో సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ స్పందించారు. జట్టు కూర్పులో భాగంగా గిల్‌ను తప్పించాల్సి వచ్చిందన్నారు. టీమ్ మేనేజ్‌మెంట్ టాప్ ఆర్డర్‌లో వికెట్ కీపర్‌ను ఆడించాలని భావించిందని, అందుకే శుభ్‌మన్ గిల్‌ను తప్పించి సంజూ శాంసన్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. శాంసన్‌కు బ్యాకప్‌గా మరో వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్‌ను జట్టులో చేర్చినట్లు పేర్కొన్నారు.

# రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్




స్పోర్ట్స్ న్యూస్, 20 డిసెంబర్ (ఇది కద నిజం ): టీమిండియా స్టార్ బ్యాట్‌మెన్స్ రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ ల అభిమానులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. వీరిద్దరూ విజయ్ హజారే ట్రోఫీ 2025–26లో ఆడనున్నారు. విరాట్ కోహ్లీ, పంత్, ఇషాంత్ శర్మ, నవదీప్ సైనీ తమ జట్టు తరపున ఆడతారని ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ అధికారికంగా ప్రకటించింది. అటు ఈ టోర్నమెంట్‌లో తొలి రెండు మ్యాచుల్లో రోహిత్ శర్మ ఆడనున్నారని ముంబై క్రికెట్ అసోసియేషన్ అధికారి ఒకరు వెల్లడించారు. డిసెంబర్ 24 నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. మరోవైపు.. వన్డే, టీ20 జట్లలో ఉన్న భారత ఆటగాళ్లందరూ డిసెంబర్ 24 నుంచి ప్రారంభమయ్యే విజయ్ హజారే ట్రోఫీ (2025–26)లో కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐ కండిషన్ పెట్టిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ షెడ్యూల్ నుంచి విరామం ఉన్నప్పుడు, సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనడం ద్వారా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాలనేది బోర్డు ఉద్దేశం. అలాగే సీనియర్లు ఆడటం వల్ల యువ ఆటగాళ్లకు కూడా ప్రేరణ లభిస్తుందని బీసీసీఐ భావిస్తోంది.